క్లుప్తంగా

వైద్యశిబిరాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వైద్యం అందక తిర్యాణి మండలంలోని పంగిడిమాగర గ్రామానికి చెందిన ఆత్రం అనురాగ్ డెంగీ జ్వరంతో మృతి చెందారని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాంమడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, ఖలీందర్ అలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, ఇప్పకాయల లింగయ్య, జోగుల మల్లయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లోని పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు కోరారు. కమిషనర్ సంపత్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ విలీన గ్రామాల కార్మికులకు రూ.17,500ల వేతనాలు ఇవ్వడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పెంచిన వేతనాలు ప్రతీనెల 5లోపు అందించేలా చూడాలని కోరారు. అధ్యక్షుడు చిప్పకుర్తి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శ్యాంకుమార్, జి.రాజు, ఏ.చిన్నమల్లయ్య, నర్సయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాలటౌన్: హైటెక్‌సిటీ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైటెక్‌సిటీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కాలనీ అధ్యక్షుడు ఏ.కిషన్‌రావు, జనరల్ సెక్రటరీ టి.చంద్రమౌళి, వైస్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీనారాయణ, కోశాధికారి ఓ.రాజనర్సు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



అంగ్రాజ్‌పల్లి వద్ద ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో చత్రునాయక్

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి, దుగ్నెపల్లి, సుందరసాల, ముత్తరావుపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను డీఏవో చత్రునాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లకు పలు సూచనలు చేశారు. ఎరువుల అమ్మకాలు జరిగింది పీఓఎస్ మిషన్‌లో తప్పనిసరిగా నమోదు చేసి రసీదు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నానో యూరియా, డీఏపీపై అవగాహన కల్పించారు. అనంతరం అన్నారం బ్యాక్‌వాటర్ ద్వారా మునిగిన పంటలను సందర్శించారు. ఏడీఏ బానోతు ప్రసాద్ నాయక్, ఏవో యామిని ఉన్నారు.

కుర్చీల పంపిణీ

శ్రీరాంపూర్: నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ శుక్రవారం కుర్చీలు పంపిణీ చేశారు. గడ్డం వెంకటస్వామి స్మారకార్థం యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ తోకల సురేశ్ ఆధ్వర్యంలో ఈ కుర్చీలు సమకూర్చగా వీటిని ఎంపీ చేతులమీదుగా పంపిణీ చేశారు. గర్భిణుల సౌకర్యార్థం ఈ కుర్చీలను సమకూర్చినట్లు వారు తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో, వైద్యులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హలో విద్యార్థి–చలో లక్సెట్టిపేట పేరుతో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో లక్సెట్టిపేటలో నిర్వహించనున్న యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి పిలుపునిచ్చారు. హాజీపూర్‌లో జిల్లా మహాసభల ప్రచార పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న మహాసభలకు విద్యార్థులు, మేధావులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

జ్వరాలు జోరు.. రోగులు బేజారు

- రికార్డు స్థాయిలో ఔట్ పేషెంట్లు
- రోజు రోజుకు పెరుగుతున్న బాధితులు
- కిక్కిరిసిపోతున్న ఆస్పత్రి

చెన్నూర్ ఆస్పత్రిలో వారం రోజులుగా రోగుల వివరాలు

తేదీ	ఓపీ	ఐపీ	జ్వర పీడితులు
21	360	50	40
22	396	61	41
23	325	58	44
24	195	44	26
25	428	51	36
26	307	36	29
27	125	32	21
28	358	43	31



చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీ పరిధిలో పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. భారీ వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా జ్వరాలు ప్రబలి బేజారవుతున్నారు. చెన్నూర్‌లోని 50 పడకల జిల్లా ఆస్పత్రిలో రోజు రోజుకు జ్వర బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. ఆస్పత్రికి వస్తున్న రోగులు, బంధువులతో కిక్కిరిసిపోతోంది. రోజువారీగా ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ల సంఖ్య గతంలో ఏనాడూ 150 దాటలేదు. గత వారం రోజులుగా రికార్డు స్థాయిలో ఔట్ పేషెంట్ల సంఖ్య నమోదవుతోంది. 30 నుంచి 40మంది ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. జ్వరాలతోపాటు దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, వారం రోజులపాటు నిత్యం ఫాగింగ్‌తోపాటు బ్లైటెక్స్ ద్రావణం పిచికారీ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. గతం కంటే ఈ వారం రోజుల నుంచి ఓపీ భారీగా పెరిగిందని, ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో ఈ నెల 25న 428 మంది ఓపీ నమోదైందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. రోగులకు ఇబ్బందులు కలుగకండా చికిత్స అందిస్తున్నామని, అందుబాటులో ఉన్న పడకలను కేటాయించి వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



చెన్నూర్: క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న పీఈటీలు

దండేపల్లి/చెన్నూర్/మంచిర్యాలఅర్బన్/వేమనపల్లి/లక్సెట్టిపేట: జిల్లాలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దండేపల్లి మండలం కొర్విచెల్మ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వేనంక చక్రవర్తి రచించిన ×విద్యార్థి గళం×అనే పిల్లల కవిత సంకలనాన్ని ఆవిష్కరించారు. ఎంఈవో చిన్నయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- చెన్నూర్‌లో గురుకృపా స్పోర్ట్స్ అసోసియేషన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కేవీఎం ప్రకాశ్‌రావు, కారెంగుల రామయ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో మోహన్ క్రీడా జ్యోతిని వెలిగించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను బహుమతులు అందజేశారు. పీఈటీలు దాసరి మల్లేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.
- మంచిర్యాలలోని శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సంజీవ్, జోనల్ పీఈటీ రాజేందర్, పీఈటీలు అక్షయ్‌కుమార్, అనూష, రేఖ, ఏవో విలాస్ పాల్గొన్నారు.
- వేమనపల్లి మండలం నీల్వాయి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభకనబర్చిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీవో కుమారస్వామి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, అటవీ రేంజ్ అధికారి హఫీజొద్దీన్, డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్ కుమార్, పశువైద్యాధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.
- లక్సెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబాఫూలే పాఠశాల, కళాశాలలో రెండు రోజులుగా ఇంట్రామ్యూరల్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సీహెచ్ మంగ శుక్రవారం బహుమతులు అందజేశారు. ఏటీపీ తిరుమల్, డీడబ్ల్యూ వాణి, పీడీ నాంపల్లి, పీఈటీ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు, అన్నదానాలు



ఎల్లయ్యపల్లెలో కుంకుమ పూజలో మహిళలు



అదిత్య ఎన్‌క్లేవ్‌లో వినాయకుని వద్ద..

దండేపల్లి/శ్రీరాంపూర్/భీమారం/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలఅర్బన్/రామకృష్ణాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్రతిష్ఠించిన గణపయ్యలకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయా మండపాల వద్ద కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దండేపల్లి మండలంలోని ఎల్లయ్యపల్లె భజరంగ్‌దళ్, మేదరిపేట శ్రీ సిద్ధి వినాయక వినాయక మండపాలు, శ్రీరాంపూర్ కాలనీలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం, భీమారంలోని కుమ్మరి వీధి, ఆవిడం ఎక్స్ రోడ్డు మండపం వద్ద, తాండూర్ శ్రీ భక్త మార్కండేయ శివాలయం, తాండూర్ ఐబీ శ్రీ గణేష్ మండలితోపాటు పలుచోట్ల, హాజీపూర్ మండలం పెద్దంపేట పంచాయతీ గొల్లపల్లి, పాత మంచిర్యాల సాయిబాబా టెంపుల్, మంచిర్యాలలోని అదిత్య ఎన్‌క్లేవ్‌లో వెల్ఫేర్ అసోసియేషన్, క్యాతనపల్లి మున్సిపల్ పరిధి గద్దెరాగిడిలోని శ్రీ సాయిగణేష్ మండలి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. టీఎన్జీఓస్ హౌజింగ్ బోర్డు శ్రీసిద్ధి వినాయక గణేశ్ మండలి ఆధ్వర్యంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి–పల్లవి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గణేశ్ మండపం వద్ద పూజలో కమాండెంట్ వెంకటరాములు దంపతులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల సందర్శన

చెన్నూర్: మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించారు. అనంతరం బట్టిగూడెం గణేశ్ మండలి వద్ద జిల్లా అధ్యక్షుడిని నిర్వాహకులు సన్మానించారు. బీజేపీ నాయకులు దుర్గం అశోక్, తుమ్మ శ్రీపాల్, మంత్రి సురేఖ, బత్తుల సమ్మయ్య, మంత్రి రామయ్య, జాడి తిరుపతి, కొండపాక చారి, తుమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు రక్షణ బహుమతుల ప్రదానోత్సవం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎంలు, అధికారులు

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్: సింగరేణి 55వ రక్షణ పక్షోత్సవాల బహుమతి ప్రదానోత్సవం ఈనెల 31న జరుగనుంది. శ్రీరాంపూర్‌లో జరగాల్సిన వేదికను వర్షాల నేపథ్యంలో రామకృష్ణాపూర్‌కు మార్చారు. క్యాతనపల్లిలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వీటి ఏర్పాట్లను శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, సేఫ్టీ జీఎంలు రఘుకుమార్, మధుసూదన్ శుక్రవారం పరిశీలించారు. శ్రీరాంపూర్ ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఇంజినీర్ సాంబశివరావు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, విజయ్‌కుమార్ ఉన్నారు. ఆదివారం ఉదయం సేఫ్టీ ట్రిపార్టీయేట్ సమావేశం, అదే రోజు సాయంత్రం 6 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం జరుగనుంది.

ముఖ్యుల రాక..

డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీజీఎంఎస్) ఉజ్వల్ థా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కంపెనీ సీఎండీ ఎన్.బలరాం, డీడీజీఎంఎస్ టీఆర్ కన్నన్, సింగరేణి డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు (ఈఅండ్ఎం), ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్), గౌతమ్ పొట్రు, ఐఏఎస్(పా), ఈడీ బి.వెంకన్నతోపాటు ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తదితరులు పాల్గొననున్నారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు కంపెనీ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జీఎం ఎం.శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు బండి రమేశ్ మాట్లాడుతూ కార్మికులు అలవెన్సులపై చెల్లిస్తున్న ఆదాయ పన్నును యాజమాన్యం చెల్లించాలన్నారు. ఇంకా ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పాగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, ఏరియా నాయకులు సాదుల భాస్కర్, వెంగళ కుమారస్వామి, బుస్స రమేష్, తొంగల రమేష్, ఫిట్ సెక్రెటరీలు గడ్డం సుధాకర్ రెడ్డి, దుర్గం రవికుమార్, కురుమ వికాస్, అందె రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సూటబుల్ జాబ్‌పై త్వరలో ఉత్తర్వులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి త్వరలో ఉత్తర్వులు రాబోతున్నాయని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ 3,3ఏ గనిని సందర్శించి మైనింగ్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిపై యజమాన్యంతో తాము ఒప్పందం చేసుకున్నామని ఈ ఒప్పందానికి అనుగుణంగా ఉత్తర్వులు రాబోతున్నాయన్నారు. 2016, 2017 బ్యాచ్‌ల వారికి ఓవర్‌మెన్ ప్రమోషన్ రావడానికి ఎస్ఓసీలు ఇప్పిస్తామన్నారు. అండర్ మేనేజర్ పరీక్ష రాసేందుకు యాజమాన్యంతో మాట్లాడుతామన్నారు. 2013, 2016, 2017 బ్యాచ్‌లంటూ, డిప్లొమా నాన్ డిప్లొమా అంటూ కొందరు మైనింగ్ సిబ్బందిని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, మైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షుడు అద్దు శ్రీనివాస్, సెక్రెటరీ బాలకృష్ణ, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి సురేష్, ఫిట్ సెక్రెటరీ మురళీ చౌదరి, నాయకులు తొటం మల్లేశ్, కిరణ్, సాయిబాబా, వెంకటేశ్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణిపై అసెంబ్లీలో చర్చ జరగాలి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు రావల్సిన విద్యుత్ బకాయిలతోపాటు సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగాలని సీఐటీయూ మందమర్రి బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–5 గనిపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి భవిష్యత్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలపాలన్నారు. నాయకులు రాజేందర్, వెంకటేశ్, కుమార్, ఆ దర్శ్, నవీన్, వేణుగోపాల్, విద్యాసాగర్ ఉన్నారు.

బీఆర్ఎస్ ఆందోళన

మందమర్రిరూరల్: సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏరియా జీఎం ఆఫీస్ వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏరియా జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ ఉన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: నస్పూర్ మండల పరిధిలోని సింగపూర్, తాళ్లపల్లి గ్రామాల్లో నిర్వాసితులైన రజకుల సమస్యలు పరిష్కరించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముస్కె చందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నస్పూర్‌లో ఆ సంఘం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు వల్ల ఈ రెండు గ్రామాల్లోని రజకులు నిర్వాసితులయ్యారని తెలిపారు. భూములు తీసుకున్నప్పటికి ఇప్పటికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. నస్పూర్‌లోని ఆర్‌అండ్ఆర్ కాలనీలోని రజకులకు దోబిఘాట్లు నిర్మించాలని, మడేలయ్య గుడిని నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం అందజేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికురాలు రాముల మంజుల కుటుంబానికి ఓసీపీలో బీ రిలే ఆపరేటర్లు, బీ రిలే జనరల్ అసిస్టెంట్లు ఆర్థికసాయం అందించారు. మంజుల కుమారుడు మానసిక స్థితి బాగోలేక హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి ఖర్చు కావడం, ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఆమెకు అండగా నిలువాలని బి రిలే ఉద్యోగులు రూ.22500, బీ రిలే జనరల్ అసిస్టెంట్లు రూ.3 వేలు ఆర్థికసాయం అందించారు. ఓసీపీలో శుక్రవారం ఈ నగదును మంజులకు గని మేనేజర్ ఐ.శ్రీనివాస్ అందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: మహబూబ్‌నగర్‌లో ఈనెల 30, 31వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. శుక్రవారం క్రీడాకారులు బయల్దేరి వెళ్లినట్లు అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాంబమూర్తి, ఈ.మారయ్య తెలిపారు. ఈనెల 22 నుంచి జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

ఆత్మకూరి నీరజ్, తోకల సిద్ధార్థ, జొగురు అభిలాస్, కర్నాల అఖిలతేజ, తుడుం రంజిత్, సాయి సిద్దార్థ్, కొత్తపల్లి సాత్విక్, కాలి శ్రీకాంత్, నికాడి వేణు, మామిడి సహిత్, పోలు అఖిల్, అజ్మీర గౌతమ్, గురుండ్ల రిశ్వంత్, చెన్నవేణి శశాంక్, కుమ్రం శేఖర్, గురుండ్ల అక్షిత్, బండారి వినయ్, మహ్మద్ దానిష్, కొత్తూరి ప్రణయ్, బింగి విష్ణు, రోహినె నిర్మల, మచ్చ శాన్వికృష్ణ, వొద్ది సాత్విక, కడమచి ఈపిక, సహస్ర, ఆత్రం అక్షయ, జడగల్ల అంజలి, కుమ్రం అనూష, కుర్రు శ్రీవాణి, ఎండి ఆజ్మ తహసీన్ ఉన్నారు.

పీహెచ్‌సీ పనులు త్వరగా పూర్తిచేయాలి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వెంటనే పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శ్రవణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

బీసీలకు అవకాశాలు కల్పించాలి



లేఖ చూపుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

పాతమంచిర్యాల: న్యాయ వ్యవస్థలో బీసీల జనాభాకు అనుకూలంగా సమాన అవకాశాలు కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో కేంద్రన్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజుజుకు శుక్రవారం బహిరంగ లేఖ పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం బీసీలు ఉంటే న్యాయ వ్యవస్థలో కేవలం 2 శాతమే బీసీలు ఉన్నారని తెలిపారు. జనాభా ప్రతిపాదికన న్యాయమూర్తులను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు గజ్జెల్లి వెంకటయ్య, నాయకులు భీంసేన్, అశోక్, అంజయ్య, భిక్షపతి ఉన్నారు.

ప్రశ్నపత్రంతో ప్రతిభ వెలికి

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సంబంధించి ప్రశ్నపత్రాలు నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సిద్ధం చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్‌కేంద్రంలో ఎస్ఏ వన్‌కు ప్రశ్నపత్రాలకు తయారీ కోసం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభ మంచి ప్రశ్న పత్రం ద్వారానే బయటపడుతుందన్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా వ్యవహరిస్తూ ప్రశ్నపత్రాన్ని గోప్యంగా ఉంచాలని సూచించారు. డీసీఈబీ సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ వేణుమాధవ్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సబ్జెక్టుల నిపుణులు పాల్గొన్నారు.

దొంగనోటు కలకలం

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలోని ఓ పెట్రోల్ బంక్‌లో శుక్రవారం దొంగనోటును నిర్వాహకులు వినియోగదారుడికి ఇవ్వడం కలకలం రేపింది. జిల్లా కేంద్రానికి చెందిన బాధితుడు నాయికిని పోషం తెలిపిన వివరాలు.. తన కారులో రూ.వెయ్యి పెట్రోలు పోయించుకుని, రూ.2 వేలను ఫోన్ పే ద్వారా చెల్లించి, తిరిగి వెయ్యి రూపాయలను పెట్రోల్ బంకు నుంచి తీసుకున్నారు. రూ.500ల నోటు, ఒక వంద నోటు, రెండు 200ల నోట్లను నిర్వాహకులు తిరిగి ఇవ్వగా, దగ్గరలో ఓ షాపులో వస్తువులను కొనేందుకు వెళ్లాడు. రూ.200ల నోటు ఇవ్వగా, దొంగనోటుగా షాపు నిర్వాహకులు గుర్తించారు. పెట్రోల్ బంక్‌కు వెళ్లి, నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు.

తుది జాబితా ప్రక్రియను నిలిపివేయాలి

దండేపల్లి: వందుర్‌గూడ–నెల్కివెంకటాపూర్ గ్రామాల మధ్య పంచాయతీ వివాదం తేలేవరకు స్థానిక ఎన్నికలకు సంబంధించిన ఓటరు తుది జాబితా ప్రక్రియ నిలిపివేయాలని వందుర్‌గూడ గ్రామపటేల్ మొకాశీ బిర్షావ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రామస్తులతో కలిసి దండేపల్లిలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు, మంచిర్యాలలో ఆర్డీవో, డీపీవో, జెడ్పీసీఈవోతోపాటుగా జిల్లాకలెక్టర్‌కు శుక్రవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్ మాట్లాడుతూ వందుర్‌గూడ పంచాయతీని చట్ట విరుద్ధంగా ఏర్పాటు చేయడంపై కోర్టును ఆశ్రయించామన్నారు. తీర్పు వెలువడేదాక నెల్కివెంకటాపూర్, వందుర్‌గూడ గ్రామాల ఓటరు జాబితా తుది నిర్ణయ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. వందుర్‌గూడ జీపీని రద్దుచేసి, నెల్కివెంకటాపూర్ జీపీలోనే కొనసాగించాలని వినతిలో పేర్కొన్నారు. గ్రామస్తులు టేకం భీంరావు, కోవ మారుతి, సిడాం కొమురయ్య, అడ చందు, కుంరం తులసిరాం, కోవ ధర్మారావు, కుంరం బాపురావు పాల్గొన్నారు.

ఎలాంటి అభ్యంతరాలున్నా దృష్టికి తేవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు జిల్లాలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతోశుక్రవారం సమావేశమయ్యారు. ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా తయారు, పోలింగ్ కేంద్రాల ఎంపిక, వార్డుల విభజన వంటి వాటిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలన్నారు. ఇప్పటికే మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాలపై శనివారం సాయంత్రంలోగా తెలియజేయాలని చెప్పారు. స్వీకరించిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. 2న తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తామని తెలిపారు.

ఓటరు జాబితా సరిచేయాలని వినతి

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని వెంటనే సరిచేయాలని చెన్నూర్ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

హైలెవల్ వంతెన నిర్మించాలి

చెన్నూర్‌రూరల్: అక్కెపల్లి సమీపంలోని పాలవాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని అక్కెపల్లి పాలవాగుపై కూలిపోయిన లోలెవల్ కాజ్‌వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే పట్టించుకుని హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మండల, పట్టణ అధ్యక్షులు బుర్ర రాజశేఖర్‌గౌడ్, తుమ్మ శ్రీపాల్ ఉన్నారు.

కొమ్మెర సబ్‌స్టేషన్ సందర్శన

చెన్నూర్‌రూరల్: కొమ్మెర సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ ఆపరేషన్ ఉత్తమ్, డీఈ కిషోర్, ఏడీఈ బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ వినియోగదారులు, రైతులకు పంట పొలాలకు విద్యుత్ అందించాలన్నారు. ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.